


నేడే నోటిఫికేషన్

- నేటి నుంచి మొదలుకానున్న నామినేషన్ల పర్వం
- 25 వరకు దాఖలు.. 29 వరకు ఉపసంహరణ గడువు
- ఊపందుకోనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న ఈనెల 18వ తేదీన వెలువడనున్నది. అదేరోజు నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్నది. ఈనెల 25వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. ఉపసంహరణలకు 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనున్నది. జూన్ 4వ తేదీన దేశ వ్యాప్తంగా కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెలువరించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ గతనెల 16వ తేదీన వెలువడగా, అదేరోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది. జూన్ 10వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్నది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలో ఈ ఎన్నికల్లో సహాయ ఎన్నికల అధికారులుగా పనిచేయనున్నారు. నామినేషన్లను పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో స్వీకరించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కలెక్టరేట్ ప్రధాన గేట్ నుంచి కలెక్టర్ ఛాంబర్ వరకు మూడంచెల భద్రతా వ్యవస్థను పోలీసులు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,94,392 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 7,87,140, మహిళలు 8,05,755, థర్డ్ జెండర్ 101 మంది, సర్వీస్ ఓటర్లు 1,396 మంది ఉన్నారు. అత్యధికంగా పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,56,640 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,75,508 మంది ఓటర్లున్నారు. పెద్దపల్లి నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి 17సార్లు ఎన్నికలు జరగగా, ప్రస్తుతం జరగబోయే ఎన్నిక 18వసారి కావడం గమనార్హం.

● ఒక రోజు ముందే బ్యాంకు ఖాతా తెరవాలి..

నామినేషన్ దాఖలు చేయడానికి ఒకరోజు ముందు అభ్యర్థులు కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన ప్రారంభానికి ముందే అఫిడవిట్ కరెక్షన్స్ డిపాజిట్ సొమ్ము, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలనకు ఒక రోజు ముందే అభ్యర్థి ప్రతిజ్ఞ తీసుకోనున్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారం 2ఏతో పాటు అఫిడవిట్ సమర్పించాలి. అభ్యర్థుల ప్రతిపాదకులు తప్పనిసరిగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఓటర్లుగా ఉండాలి. అభ్యర్థి వయసు, కులం వివరాలు నామినేషన్ పేపర్‌పై నమోదు చేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీల తరఫున నమోదు చేసే అభ్యర్థులు వారి డిక్లరేషన్ ఫారం సమర్పించాలి. అభ్యర్థి అఫిడవిట్‌ను ఫారం 26లో పార్టీ పేరు, పార్లమెంటరీ నియోజకవర్గం పేరు, రాష్ట్రం పేరు, ఓటరు జాబితాలో పార్ట్ క్రమ సంఖ్య వివరాలు, పెండింగ్ క్రిమినల్ కేసుల వివరాలు, ఆస్తుల వివరాలు, అప్పుల వివరాలు, వృత్తి, విద్యార్హతలు తదితర వివరాలను నమోదు చేయాలి. అభ్యర్థి దాఖలు చేసిన అఫిడవిట్లో ప్రతి పేజీపై అభ్యర్థి సంతకం చేయడంతో పాటు అఫిడవిట్ నోటరీ చేయాలని లేదా కమిషనర్/ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలని, అభ్యర్థి ఫొటోసాఫ్ట్ కాపీ, హార్డ్‌కాపీ తీసుకోవాల్సి ఉంటుంది. నామినేషన్ తీసుకున్న తర్వాత రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అఫిడవిట్‌లో అన్ని కాలంలు నింపి ఉన్నాయా, ధ్రువీకరించిన ఓటరు జాబితా కాపీ(అభ్యర్థి ఇతర నియోజకవర్గ ఓటర్), ఫారం ఏ, ఫారం బీ, కుల ధ్రువీకరణ పత్రం, డిపాజిట్, ప్రతిజ్ఞ అంశాలను పరిశీలించి చెక్‌లిస్టు జారీ చేయాలి. నామినేషన్ వేసే అభ్యర్థులకు తగిన సూచనలు ఇచ్చేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

● హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం..

ఇప్పటివరకు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే సమావేశాలు నిర్వహించిన అభ్యర్థులు ఇకనుంచి ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. వాహనాలకు అనుమతులు తీసుకుని గ్రామాలు, పట్టణాల్లో మైకులతో ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి గోమాసే శ్రీనివాస్‌లకు టికెట్లు ఖరారైన విషయం తెలిసిందే. వీరేగాకుండా వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో నిలవనున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు మాత్రం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో బహిరంగ సభల నిర్వహణకు ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు, బీఆర్ఎస్ పార్టీ తరఫున కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, బీజేపీ తరఫున రాష్ట్ర నేతలతో పాటు అమిత్‌షా, జేపీ నడ్డా, యూపీ ముఖ్యమంత్రి యోగి ప్రచార సభలకు హాజరయ్యే అవకాశాలున్నాయి.



బూడిద చెరువులపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కోల్‌సిటీ, ఏప్రిల్ 17: ఆర్‌ఎఫ్‌సీఎల్ ఆవరణలో ప్రమాదకరంగా మారిన బూడిద చెరువులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎఫ్‌సీఐ యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రమాదకరంగా బూడిద చెరువులు శీర్షికన ఏప్రిల్ 7వ తేదిన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమలోని ఓల్డ్ యాష్‌పాండ్, శాంతినగర్ సమీపంలోని ఆక్సిడేషన్ పాండ్‌లలో బూడిద తరలించాక మట్టిపోసి లెవల్ చేయకపోవడంతో క్వారీలుగా మారాయి. సేల్‌అగ్రిమెంట్ ప్రకారం బూడిద తరలించాక మట్టి పోసి లెవల్ చేయాల్సి ఉంది. మూడు సార్లు ఎక్స్‌టెన్షన్ ఇచ్చినా కూడా బూడిద తీసి లెవల్ చేయలేదు. దీంతో బూడిద చెరువులు క్వారీలుగా మారాయి. ఇప్పటికే శాంతినగర్ సమీపంలోని బూడిద చెరువు కట్ట రెండేళ్లుగా వరుసగా తెగి సమీప కాలనీలను వరదనీటితో ముంచెత్తింది. ఇప్పుడు ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాంగణంలోని ఓల్డ్ యాష్‌పాండ్‌లో లక్షల క్యూబిక్ మీటర్ల బూడిద తీయడంతో వర్షాకాలంలో పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉండే ప్రమాదం ఏర్పడింది. ఈ నీరు శాంతినగర్ బూడిద చెరువుకు చేరితే సమీప కాలనీలకు ప్రమాదం వాటిల్లనున్నది. ఎఫ్‌సీఐ, ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలు వీటిని లెవల్ చేయించడంపై దృష్టి పెట్టడం లేదు. కాగా బూడిద చెరువు విషయంలో ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎఫ్‌సీఐ యాజమాన్యాలు ఎవరికి వారు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఖమ్మంపల్లి ఎర్రమట్టిగుట్టలో అక్రమ తవ్వకాలు

- రాత్రికి రాత్రి బండరాళ్ల తరలింపు - పట్టించుకోని అధికారులు



గుట్టను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

ముత్తారం, ఏప్రిల్ 17: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ శివారులో ఎర్రమట్టి గుట్టలో దొంగలు పడ్డారు. గత 20 రోజులుగా బండలను పగులగొట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరు తీస్తున్నారో.. ఎందుకు తీస్తున్నారో తెలియదు కానీ ఎర్రమట్టి గుట్టలను మాయం చేస్తున్నారు. గ్రామంలోని ఫారెస్ట్ భూముల్లోగల ఎర్రమట్టి గుట్టలను గుర్తించిన వారు 20 రోజులుగా రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్లు ఉపయోగించి బండను పగులగొట్టి లారీల్లో తరలిస్తున్నారు. అంతేకాకుండా రెండు రోజులనుంచి ఫారెస్ట్‌ను ఆనుకొని ఉన్న గుట్టలను మిషన్లతో రాత్రి సమయాల్లో గుట్టుగా బెండడి, కంకర రాళ్లను తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17: గోదావరిఖనిలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని గోదావరిఖని ఫైర్ ఆఫీసర్ సత్యానారాయణ సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక మార్కండేయకాలనీలోని స్వాండ్ మౌంటెన్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆసుపత్రి సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల్లో గాయపడినప్పుడు, స్పృహ కోల్పోయినప్పుడు ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, ద్రవ పదార్థాలైన కిరోసిన్, పెట్రోల్, వంట నూనెతో అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి మెళకువలు పాటించాలనే అంశాలపై సిబ్బందికి వివరించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది సత్తయ్య, శ్రీనివాస్, అశోక్, సంతోష్, నాగేందర్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి టికెట్ వంశీకి కేటాయించడం సరికాదు

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 17: పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ వంశీకి కేటాయించడం సరికాదని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. బుధవారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రెండు అసెంబ్లీ స్థానాలు చెన్నూరు, బెల్లంపల్లిలను వివేక్, వినోద్ ఎమ్మెల్యేగా ఉన్నారని, తాజాగా పార్లమెంట్ టికెట్ కూడా వివేక్ కుమారుడు గడ్డం వంశీకి కేటాయించడం ద్వారా కాకా కుటుంబానికి పట్టా చేసినట్టు అయిందని విమర్శించారు. ఏళ్ల తరబడి మాదిగలు కాంగ్రెస్ పార్టీకి సేవ చేసినా ఆ పార్టీ పట్టించుకోలేదని, అవసరాల కోసం పార్టీ మారిన వివేక్ కుటుంబానికి మాత్రం టిక్కెట్లు కేటాయించడం సరికాదన్నారు. మాదిగలు వివేక్‌కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్(తిమోతి), మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తగరం మధురాజు, లింగపల్లి సుధాకర్, ఇప్ప రాజన్న, అశోక్, మేడి ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, భూమన్న, రాజేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల శ్రమను దోచుకుంటున్న ఆర్‌ఎఫ్‌సీఎల్

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేష్

కోల్‌సిటీ, ఏప్రిల్ 17: ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేష్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీఎల్ కంపెనీలో కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి యూరియా ఉత్పత్తి చేస్తున్నారని, కానీ కార్మికులకు మాత్రం హక్కులు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని ఆరోపించారు. బ్యాగర్స్, స్టిచ్చర్ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందన్నారు. జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు కల్పించడం లేదని, కార్మికులకు కేవలం 10రోజులు మాత్రమే పని దొరుకుతుందని, కార్మికులకు 26 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు వందల కోట్ల లాభాలు వచ్చినా కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడం లేదని విమర్శించారు. యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు తిప్పాని రాంకీ, ఐత శ్రావణ్, శ్రీకాంత్, సతీష్, సంజీవ్, రాకేష్, శ్రీనివాస్, వరప్రసాద్, రాకేష్, వేణు, రమేష్, శ్రావణ్, తిరుపతి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 17: ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం ఆర్జీ-2 ఏరియాలో ప్రారంభమైంది. ఓసీపీ-3 పవర్ సిస్టంలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. పలువురు కార్మికులు ఐఎన్‌టీయూసీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ ఎట్టెం కృష్ణ, నాయకులు ఉస్మాన్, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు.. పట్టించుకోని అధికారులు

రామగిరి, ఏప్రిల్ 17: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వాటర్ పైప్‌లైన్ల ఏర్పాటుకు రోడ్లను ఛిద్రం చేయడంవల్ల దెబ్బతిన్నాయి. గ్రామాల్లో సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో పాటు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిధులు ల్యాప్స్ అయ్యాయి. అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా గ్రామాల్లో అధ్వానంగా తయారైన అంతర్గత రోడ్లను మరమ్మతు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పారదర్శకంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అన్నారు. రాబోయే లోక్ సభ ఎన్నికలలో ఓటర్ స్లిప్పులు ప్రతి ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌పై పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలని అన్నారు. పోటీ చేసే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీలు నియమించిన పోలింగ్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో బూత్‌స్థాయి అధికారులు ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేసే సమయంలో పాల్గొనవచ్చని, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎక్కడ కూడా అందలేదనే ఫిర్యాదులు రావద్దని అన్నారు. ఏప్రిల్ 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, అదేరోజు నుంచి ఏప్రిల్ 25 వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. నామినేషన్ స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోటీచేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటీచేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. నామినేషన్ దాఖలుకు ముందు ప్రీ వెరిఫికేషన్ డెస్క్ వద్ద పరిశీలించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంత వరకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ జరగాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, నామినేషన్ల స్వీకరణపై ప్రతిరోజు నివేదికలను సమర్పించాలని, ప్రతి రోజూ దాఖలైన నామినేషన్ అభ్యర్థుల అఫిడవిట్‌లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో మాట్లాడుతూ నామినేషన్లు దాఖలు సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థి ప్రతిజ్ఞ రిటర్నింగ్ అధికారి ముందు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి రోజు నమోదు అవుతున్న నామినేషన్లు సెట్ల వారీగా సమాచారం పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. అభ్యర్థి ఫోటోసాఫ్ట్ కాపీ, హార్డ్‌కాపీ తీసుకోవాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డీవోలు హనుమానాయక్, బి.గంగయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ తహసీల్దార్ రాజ్‌కుమార్, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, డీటీఈ ప్రవీణ్, సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

హుస్సేన్‌మియా వాగులో అక్రమంగా మట్టి తవ్వకాలు



వాగు మధ్యలో మట్టి తీయడంతో ఏర్పడిన గుంత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 17 : పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, పెద్దబొంకూర్, మూలసాల గ్రామాలకు అనుకోని ఉన్న హుస్సేన్ మియా వాగు నుంచి కొందరు అక్రమార్కులు ఇసుకను తరలించుకపోగా, అడుగు భాగంలో తేలిన మట్టిని కూడా వదలడంలేదు. ఇప్పటికే వాగును అనుకొని ఉన్న పంటపొలాలు నీరు అందక ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. కొందరు అక్రమార్కులు రాత్రింబవళ్లు ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తరలిస్తున్నారు. వాగులో ఇసుక అనవాళ్లు లేకపోగా అడుగున తేలుతున్న మట్టిని సైతం వదలడం లేదు. దీంతో వాగులో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. అటు వైపుగా వెళ్లే రైతులు, పశువుల కాపరులు భారీగా ఏర్పడిన గుంతలను చూసి జంకుతున్నారు. అయితే సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాగు నుండి ఇసుకను తరలించుకుపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులో వేల రూపాయలు వెచ్చించి బావులు తవ్వించినా నీరు పడటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్మికుల క్వార్టర్లు కూలగొడితే ఊరుకోం

హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

గోదావరిఖని, ఏప్రిల్ 17: హేతుబద్ధత లేకుండా అభివృద్ధి పేరుతో సింగరేణి కార్మికుల క్వార్టర్లను కూలగొడితే ఊరుకునేది లేదని హెచ్‌ఎంఎస్ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం చౌరస్తా సమీపంలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి తాము వ్యతిరేకంకాదని, కానీ అభివృద్ధి పేర సింగరేణి యాజమాన్యం కార్మికులపై దౌర్జన్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. అవసరమైతే ఈ అంశంపై యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చేందుకు కూడా వెనుకాడమని చెప్పారు. రోడ్డు వెడల్పు అంటే రెండు వైపులా ఉండాలి కానీ ఒకేవైపు క్వార్టర్లను తొలగించడం ఏ ధర్మమని ప్రశ్నించారు. అయినా మూడు క్వార్టర్లు తొలగించి అంతపెద్ద రోడ్లు వేయాల్సిన అవసరం ఉందా అని అన్నారు. ప్రభుత్వం ఆదేశం మేరకు క్వార్టర్ల కూల్చివేతకు సిద్ధపడినట్టు సింగరేణి యాజమాన్యం అబద్ధాలు చెబుతున్నదని, ప్రభుత్వం, యాజమాన్యానికి ఒకేవైపు సింగరేణి కార్మికుల మూడు లైన్ల క్వార్టర్లు కూల్చమని ఎక్కడా చెప్పలేదన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో జీఎం ఇలా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాజీవ్ రహదారికంటే పెద్ద రోడ్లు చౌరస్తాలో ఏర్పాటు ఆవశ్యకత ఎంత ఉందన్నారు. రోడ్ల పేర కార్మికుల క్వార్టర్లు కూలగొట్టి ఆ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకునే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతున్నదన్నారు. కార్మికుల పట్ల ఆర్జీ-1 జీఎం ఇంత అమానవీయంగా వ్యవహరించడం సరైందికాదని చెప్పారు. అన్యాయంగా కార్మికుల క్వార్టర్లను కూలగొడతామంటే న్యాయబద్ధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తోట వేణు పాల్గొన్నారు.



వెలసిన శ్రీరాముని విగ్రహం

రాయికల్, ఏప్రిల్ 17: మండలంలోని అల్లీపూర్, సింగరావుపేట గ్రామాల మధ్య ఉన్న రాములోరి బిలుకుపై శ్రీరాముని విగ్రహం బుధవారం వెలిసింది. ఈ సందర్భంగా విగ్రహానికి గ్రామస్థులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లీపూర్ మాజీ సర్పంచ్ బాలె శోభారాణి, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, మాల్యావు మురళి, బర్ల లవణ్, వేముల సతీష్, వేణురావు తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ మండలంలోని అయోధ్య సీతారామునికి సింగరావుపేట గ్రామానికి చెందిన నాగేంద్రచారి అనే కళాకారుడు స్వర్ణ సూర్య తిలకాన్ని తయారు చేసి స్వామివారికి అలంకరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో సూర్య కిరణాలతో సీతారామునికి తిలకాన్ని అందించగా ఇక్కడ స్వర్ణ తిలకాన్ని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రచారిని పలువురు అభినందించారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17: రామగుండం కార్పొరేషన్‌లో పిచ్చి కుక్కల స్వైర విహారం రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం 26వ డివిజన్ మార్కండేయకాలనీలో ఓ పిచ్చి కుక్క ఎనమిది మందిపై దాడి చేసింది. ఇందులో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ పది రోజుల్లో ఆయా కాలనీల్లో 20మంది పిచ్చి కుక్కల బారిన పడ్డారు. మార్కండేయకాలనీలో బుధవారం రోడ్డుపై నడిచివెళుతున్న వారిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన 8మంది గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. రామగుండం కార్పొరేషన్‌లో ఒకవైపు కుక్కల బెడద మరోవైపు కోతుల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కిరాణంలో మద్యం నిల్వలు : కేసు నమోదు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌లో బుధవారం పోలీసులు ఓ కిరాణం దుకాణంలో మద్యం నిల్వలను గుర్తించారు. గ్రామానికి చెందిన గోపి అనే వ్యక్తి కిరాణం నిర్వహిస్తూ అందులోనే మద్యం విక్రయిస్తున్నాడని గుర్తించారు. కిరాణంలో నిల్వ ఉన్న సుమారు 6,500 రూపాయల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




















జగిత్యాలలో జోరుగా వ్యభిచారం

- బాలికలతో వ్యాపారం కొనసాగిస్తున్నారని గుర్తించిన పోలీసులు

- నోటీసులు జారీ చేసిన తహసీల్దార్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 17: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల-నిజామాబాద్ రహదారిలో ఉన్న ఓ ప్రాంతంలో కొన్ని రోజులుగా జోరుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇంటిలో కొంత మంది ఇతర ప్రాంతాల నుంచి మహిళలు, బాలికలను ఇక్కడకు తీసుకువస్తూ వ్యభిచార రొంపిలోకి దించుతూ సొమ్ముచేసుకుంటున్నారు. అయితే జోరుగా వ్యభిచారం జరుగుతుందనే అనే సమాచారంతో పట్టణ పోలీసులు ఈ ప్రాంతంలో దాడులు నిర్వహించగా ఓ బాలిక వ్యభిచారం చేస్తూ పట్టుబడినట్లు తెలిసింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. గాంధీనగర్ ప్రాంతంలో ఓ మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. బాలికతో పాటు మహిళలతో వ్యభిచారం చేయిస్తూ సొమ్ము చేసుకోవడంతో పాటు ప్రజారోగ్యానికి హానికరంతో పాటు అనైతిక చర్యగా పాల్పడుతున్నట్లు భావించారు. దీంతో రెవెన్యూ అధికారులు సెక్షన్ 133 సీఆర్‌పీసీ కింద నిర్వాహకురాలికి నోటీసులు జారీ చేశారు. బుధవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌తో పాటు సీఐ వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సంబంధిత ఇంటిని గుర్తించి నోటీసును అతికించారు. మూడు రోజుల్లో దీనిపై సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



రోదిస్తున్న కుటుంబీకులు(ఇన్‌సెట్‌లో సాయి(ఫైల్))

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17: మూగ జీవాన్ని కాపాడబోయిన యువకుడు ఈత రాకపోవడంతో చెరువులో మునిగి ప్రాణాలను ఒదిలాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల్‌కార్ సాయికుమార్ (23) తండ్రి మాంసం విక్రయిస్తాడు. ఈ క్రమంలో తమకున్న మేకలు, గొర్రెలను మేత కోసం తండ్రి కిషన్‌తో కలిసి సాయికుమార్ గ్రామ శివారులోని గిద్దె చెరువు ప్రాంతానికి వెళ్లారు. ఓ మేక చెరువులోకి వెళ్లడంతో గమనించిన సాయికుమార్ కాపాడేందుకు చెరువులోకి దిగాడు. లోనికి దిగుతున్న తరుణంలో పెద్ద గోతిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. సమీపంలో ఉన్న తండ్రి గమనించి తన కొడుకు చెరువులో మునిగిపోయాడని, రక్షించాలంటూ కేకలు వేశాడు. చుట్టు పక్కల వారితోపాటు అక్కడకు చేరుకున్న యువకులు కొత్త రాజు, కుంచం రవి, గౌరీశంకర్, శ్రీనివాస్ చెరువులోకి దిగి గాలించారు. ఈ క్రమంలో శ్రీనివాస్ నీట మునుగుతుండగా గౌరీశంకర్ గమనించాడు. వెంటనే అప్ర మత్తమై అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. మరో ప్రాణం పోకుండా రక్షించాడు. అనంతరం సుమారు 30 నిమిషాల పాటు సాయికుమార్ మృతదేహం కోసం గాలించారు. చివరకు సాయికుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. యువకులను స్థానికులు అభినందించారు. మృతుడి తండ్రి కిషన్ ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆరె కటిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, సభ్యులు కోరారు.

అంజన్న సేవలో న్యాయమూర్తులు



కొండగట్టు అంజన్న సన్నిధిలో న్యాయమూర్తులు

మల్యాల, ఏప్రిల్ 17: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం వేములవాడ, సిరిసిల్లా, కరీంనగర్, మంచిర్యాల కోర్టుల న్యాయమూర్తులు జ్యోతి, ప్రవీణ్ కుమార్, హేమలత, స్వాతి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుల రిమాండ్

కథలాపూర్, ఏప్రిల్ 17 : మండలంలోని తక్కళ్ళపల్లిలో నక్క సతీష్ ఇంట్లో చోరీకి పాల్పడ్డ నలుగురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై నవీన్ తెలిపారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో బోధన్‌కు చెందిన ఒడిబిడి పోషెట్టి అతని భార్య లక్ష్మీ, బింగి గంగమణి, జావెద్ ఖాన్ చొరబడి మూడువేల నగదు ఎత్తుకెళ్లారని వారిని పట్టుకుని రికవరీ చేసినట్టు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని చెప్పారు. వీరు జగ్గాసాగర్, వేల్పూరు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు అంగీకరించారని అరెస్ట్ చేసి కోరుట్ల మున్సిఫ్ మెజిస్ట్రేల్ ముందు హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో యువకుడి మృతి



రవికుమార్(ఫైల్)

జ్యోతినగర్, ఏప్రిల్ 17: పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని జంగాలపల్లికి చెందిన మేకల రవికుమార్(32) అనే యువకుడు వడదెబ్బకు గురై బుధవారం మృతిచెందాడు. మంగళవారం తన పశువులను మేపేందుకు వెళ్లిన రవికుమార్ వడదెబ్బకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడికి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రవికుమార్ మృతి చెందినట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న రవికుమార్ అవివాహితుడు. మృతుడి తండ్రి మేకల లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్ఐ రియాస్ అహ్మద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గడ్డివాము దగ్ధం

ఓదెల, ఏప్రిల్ 17 : మండలంలోని కొలనూర్‌లో బుధవారం కర్రే లక్ష్మారెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాము విద్యుత్ ఘాతంతో దగ్ధమైంది. గ్రామస్తులు పెద్దపల్లిలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో తరలివచ్చి మంటలను ఆపివేశారు. ఈ సంఘటన వల్ల దాదాపు రూ.40వేల మేరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

జమ్మికుంటలో కారు..



జమ్మికుంటలో కాలిపోయిన కారు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17: జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న ఓంసాయి అనే మతి స్థిమితం లేని యువకుడు బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఉన్న తన తండ్రి కారును దగ్ధం చేశాడు. కారులో నుంచి మంటలు రావడాన్ని కుటుంబ సభ్యులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. యువకుడి తల్లి మాట్లాడుతూ ఐదేళ్లుగా తన కుమారుడి ఆరోగ్యం బాగలేదని, ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాడని, కారు ఎందుకు తగులబెట్టావని అడిగితే చెప్పడం లేదని తెలిపారు.

గుడుంబా ప్యాకెట్లు పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17: మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇల్లంతకుంట మండలం మాల్యాల గ్రామానికి చెందిన తిరుపతిసురేష్, శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సమ్మయ్యను తనిఖీలు చేయగా గుడుంబా ప్యాకెట్స్ పట్టుబడ్డాయని ఎస్సై తిరుపతి తెలిపారు. సుమారు ఐదున్నర లీటర్ల గు డుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ 1,650 రూపా యలు ఉంటుందని తెలిపారు. ఇద్దరిపై పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని కల్వల గ్రామ శివారులో బుధవారం గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆమెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సమ్మయ్య అనే వ్యక్తి కల్వల గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశామని చెప్పారు. ఈ మేరకు గుడుంబా సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. సమ్మయ్య నుంచి 40 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 17: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎలబోతారం గ్రామంలోని గొడిశాల క్రాసింగ్ వద్ద ఎస్సై జన్ను ఆరోగ్యం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో వీణవంక మండలం జంగపల్లి గ్రామానికి చెందిన మూ డు ట్రాక్టర్లు మానేరు వాగునుంచి అక్రమంగా తీసుకొని వెళ్తుండడంతో పట్టుకున్నామని ఎస్సై చెప్పారు. ఆ ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గన్నేరువరం, ఏప్రిల్ 17: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై గన్నేరువరం పోలీసులు కేసు నమోదు చేశారు. బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన పల్లె సంతోష్ అనే బెల్ట్‌షాప్ నిర్వహకుడు బుధవారం గన్నేరువరం నుంచి రూ.21,712 విలువ గల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మైలారం ఎక్స్ రోడ్ వద్ద ఎస్సై తాండ్ర నరేష్ పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యాన్ని తరలించినా, బెల్‌షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, ఏప్రిల్ 17: మండలంలోని ఈదులగట్టెపల్లి బస్టాండ్ సమీపంలో గల కాకతీయ కాల్వ వద్ద బుదవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ప్రక్కన గల కాకతీయ కాల్వ వద్ద అనుమానాస్పద స్థితిలో సుమారు 40 సంవత్సరాల లోపు గల గుర్తు తెలియని వ్యక్తిగా స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

మియాపూర్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 17: మండలంలోని మియాపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి లచ్చయ్య, శశిరేఖ దంపతులు కూలీపని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం ఉదయం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఇంట్లో దీపం వెలిగించి పూజలు చేసుకుని ర్యాకల్‌దేవ్‌పల్లి జాతరకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం, ఇంటినుంచి పొగ రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించారు. మంటలు ఎక్కువై ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ప్రమాదం గురించి బాధితులకు సమాచారం అందించగా వారు వచ్చి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కొయ్యడ స్వప్నఅరుణ్ కోరారు.

కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా

ప్రభుత్వంలో చలనం లేదు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక ఇద్దరు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేక పోవడం దురదృష్టకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, నూతన ఆర్డర్లు ఇవ్వకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజల నిరసనను ప్రభుత్వం ఎదుర్కోక తప్పదన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని ఆసాములు, కార్మికులు, యజమానులు, ప్రజా సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి త్వరగా బతకమ్మ చీరల బకాయిలు చెల్లిస్తామన్నారన్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఇస్తామని స్పష్టమైన హామీనిచ్చి పది రోజులు గడుస్తున్నా అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దాదాపు 30 వేల మంది కార్మిక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను 48 గంటలో నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు చంద్రమౌళి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో గల్ఫ్ కార్మికుడి బలవన్మరణం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని సంగెం గ్రామానికి చెందిన శనిగారపు మహేష్ (30) అనే గల్ఫ్ కార్మికుడు అప్పుల బాధతో మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ ఉపాధి నిమిత్తం మూడు సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దు బాయ్ వెల్లగా అక్కడ సరైన పని దొరకపోవడంతో కొన్ని రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గల్ఫ్‌కు వెళ్లే సమయంలో మహేష్ బంధువుల వద్ద సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన బంధువులు మహేష్‌ను డబ్బుల విషయంలో ఒత్తిడి చేయడంతో మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మహేష్ భార్య నాలుగు నెలల గర్భవతి అని గ్రామస్థులు తెలిపారు.

పెళ్లి చేసుకొమ్మన్నందుకు యువకుడి ఆత్మహత్య



యోగేశ్(ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 17: వయసు మీరిపోతోంది పెళ్లి చేసుకుని ఓ ఇంటి వాడివి కావాలని కుటుంబ సభ్యులు కోరగా మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భూషణరావుపేటకు చెందిన రాసమల్ల యోగేశ్ (28) అనే యువకుడు హెయిర్ సెలూన్ నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. అయితే ఇంట్లో వారు పెళ్లి చేసుకోమని కోరుతుండగా తాను ఇప్పుడే పెళ్లి చేసుకోనంటూ చెబుతూ వచ్చాడు. వారం రోజుల కిందట మనస్తాపం చెందిన యోగేశ్ పురుగుల మందు తాగడం తో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇన్సూరెన్స్ లేని స్కూల్ వ్యాన్

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- బాధిత కుటుంబసభ్యుల ఆందోళన



ప్రమాదానికి కారణమైన స్కూల్ వ్యాన్

మల్యాల, ఏప్రిల్ 17: విద్యార్థులను తరలించే స్కూల్ వ్యాన్‌ను ఇన్సూరెన్స్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్య నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలి అయింది. మండలంలోని మద్దుట్లలో రామన్నపేటకు చెందిన శ్రీసరస్వతీ విద్యానికేతన్ స్కూల్ వ్యాన్ ముందు టైర్లు ఎక్కడంతో చిన్నారి అరీబా(18నెలలు) మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. కాగా బుధవారం మృతి చెందిన చిన్నారి కుటుంబసభ్యులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్కూల్ ముందు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు సిద్ధం అయ్యారు. స్కూల్ వ్యాన్‌కు ఇన్స్‌రెన్స్ లేకపోవడంతో మండిపడ్డారు. మద్దుట్లకు చెందిన నాయకులు కూడా స్కూల్ యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాఠశాల నిర్వహకులు, ప్రైవేట్ స్కూల్స్ సంఘ నాయకులు చిన్నారి ఇంటికి వచ్చి మాట్లాడారు. స్కూల్ వ్యాన్‌కు ఇన్స్‌రెన్స్ ఉంటే తమకు మేలు జరిగేదని లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా చిన్నారి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇన్స్‌రెన్స్ లేకపోవడంతో పరిహారంగా రెండు విడతల్లో రూ.5.5లక్షల చెల్లింపునకు పాఠశాల యాజమాన్యం ఒప్పుకున్నారని, దీంతో చిన్నారి కుటుంబసభ్యులు ఆందోళన విరమించినటు తెలిపారు. కాగా స్కూల్ వ్యాన్ ఇన్సూరెన్స్ వివరాలు తెలుసుకునేందుకు నిర్వహకులు సత్యనారాయణరావును సెల్‌ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు.

● **వాహనాల పత్రాలపై నిర్లక్ష్యం..**

స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాల ఇన్స్‌రెన్స్, ఫిట్‌నెస్, ట్యాక్స్ తదితర అన్ని రకాల పత్రాలు రవాణాశాఖ అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంటుండగా.. మద్దుట్లలో ప్రమాదానికి కారణమైన స్కూల్‌వ్యాన్‌కు ఇన్సూరెన్స్ లేకపోవడాన్ని అధికారుల తనిఖీల లోపంగా మద్దుట్ల వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాలను పకడ్బందీగా తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా స్పందించాలని కోరుతున్నారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



పర్యావరణ దినోత్సవం నిర్వహణపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 17: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై బుధవారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అనుసంధానంతో మిషన్ లైఫ్‌పై నెలరోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జీఎం పేర్కొన్నారు. గనులపై, ఉద్యోగుల కాలనీల్లో సమావేశాలు నిర్వహించడం, సైకిల్ ర్యాలీలు, ఈ వ్యర్థాల సేకరణ, క్విజ్, సెమినార్లు, వర్క్‌షాప్‌లు విజయవంతం అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, ఎర్రన్న, రాజేంద్రప్రసాద్, ధనుంజయ, మురళీకృష్ణ, అభిలాష్, సృజన్ మెహ్రా, సురేష్ బాబు, రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

నీటిసరఫరాలో అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 17: మోటార్ల మరమ్మత్తుల కారణంగా సెక్టార్-3 కాలనీ, పోతనకాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఆర్జీ-2 ఏరియా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి నదిలో ఇన్‌టేక్ వెల్ వద్ద మోటార్లకు మరమ్మతులు చేస్తున్న కారణంగా 10రోజుల వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు తెలిపారు. పదిరోజుల పాటు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయనున్నామని, నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

పెనాల్టీల రికవరీని రద్దు చేయాలి

రామగిరి, ఏప్రిల్ 17: సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు విధులకు హాజరుకాని పక్షంలో పెనాల్టీ పేరిట రికవరీ చేస్తున్నారని, ఆ విధానాన్ని రద్దుచేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆకుల వెంకన్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. టెండర్ నిబంధనల ప్రకారం కార్మికుల సంఖ్య తగ్గిన పక్షంలో ప్రతి మస్టర్‌కు రూ.300 రికవరీ చేయాలనే విధానంపై 2023లో కాంట్రాక్టర్లకు యాజమాన్యం సర్క్యూలర్ జారీచేసిందన్నారు.రికవరీ నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్

ధర్మారం, ఏప్రిల్ 17: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుధవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, సంతోష్‌కుమార్, కాంపెల్లి రాజేశం, చింతల జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహం, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోల్‌బెల్ట్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలు

- అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం అంతంతే - గోదావరిఖనిలో రోజుకు మూడునాలుగు కేసులు నమోదు

గోదావరిఖని, ఏప్రిల్ 17: సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతంలో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. బాధితుల అవసరాలు, ఆశలు, బలహీనతలను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. రికవరీకి సంబంధించిన వ్యవస్థలు ఇంకా అభివృద్ధి చెందకపోవడంతో సైబర్ నేరగాళ్ల ఆటలు సాగుతున్నాయి. ఝార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మహారాష్ట్ర కేంద్రాలుగా ఈ సైబర్ నేరస్థులు ఖాతాల్లో నుంచి డబ్బులు లాగేసుకుంటున్నారు. రూ.25వేలలోపు బ్యాంకు నుంచి సైబర్ నేరస్థులు కొట్టేస్తే 24 గంటల లోపు హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ కాల్ సెంటర్(1930)కు కాల్‌చేస్తే వాళ్లు నమోదు చేసుకుని ఫిర్యాదుదారు వివరాలను సేకరించి ఆ డబ్బులు ఏ అకౌంట్‌కు వెళ్లాయో గమనిస్తున్నారు. ఆ అకౌంట్‌లో డబ్బులు ఉంటే కోర్టు ద్వారా తిరిగి ఇప్పిస్తున్నారు. కానీ ఈ డబ్బులు కొట్టేసిన నేరస్థుడు తన అకౌంట్‌లో డబ్బులను విత్‌డ్రా చేస్తే ఆ అకౌంట్ ఫ్రీజ్ చేయించడం మినహా ఏమి చేయలేకపోతున్నారు. అకౌంట్ నంబర్ల ద్వారా నేరస్థులను గుర్తించినప్పటికీ ఎఫ్ఐఆర్ చేసి వారిని పట్టుకురావడానికి లక్షలాది రూపాయలు, వ్యయప్రయాసలు ఉంటాయి కనుక పోలీసులు కూడా ఏం చేయలేకపోతున్నారు. అంతర్‌రాష్ట్రాల్లో నేరగాళ్ల అడ్రస్‌లు ఉండడం వల్ల పోలీసులు ఈ వ్యవహారాల్లో తీవ్రంగా స్పందించలేకపోతున్నారు. రూ.25వేలు దాటి సైబర్ క్రైమ్ జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రయత్నిస్తున్నారు. ఒకసారి సైబర్‌క్రైమ్ జరిగితే డబ్బులు తిరిగి రావడం దాదాపు గగనమే. ఒక్క గోదావరిఖని వన్‌టౌన్‌లో రోజూ 3 నుంచి 4 ఇలాంటి ఆర్థిక సైబర్ నేరాలు నమోదవుతుండడం గమనార్హం.

● వివిధ మార్గాల ద్వారా..

బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరస్థులు డబ్బులు కొట్టేయడానికి రెండుమూడు మార్గాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా ఓటీపీలను తెలుసుకోవడం ద్వారా డబ్బులను కాజేస్తున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పి ఆ యాప్‌ల ద్వారా ఖాతాదారు ఓటీపీలను సరాసరి వారికే వచ్చేలా చేసుకుని సైబర్ నేరగాస్థులు డబ్బులను కొట్టేస్తున్నారు. ఖాతాదారులను ఆకర్షించడానికి సరాసరి బ్యాంకు నుంచే ఫోన్ చేస్తున్నామని, ఏటీఎం కార్డులు, క్రెడిట్‌కార్డుల లిమిట్ పెంచుతామని మాట్లాడుతూ ఖాతాకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. వివిధ ఆఫర్ల పేర కూడా ఎరవేస్తున్నారు. ప్రైవేట్ జాబ్‌లు పెట్టిస్తామని, నెలకు లక్షలాది రూపాయలు వస్తాయని చెబుతూ అకౌంట్ డిటైల్స్ తీసుకుంటున్నారు. మీకు లోన్ ఆఫర్ ఉందని ప్రముఖ ఫైనాన్స్, వాణిజ్య సంస్థ పేర్లు చెప్పి వివరాలు సేకరిస్తున్నారు. బయోమెట్రిక్, ఆధార్, వేలిముద్రల సేకరణల ద్వారా ఖాతాల ద్వారా ఏటీఎంల ద్వారా డబ్బులు విత్‌డ్రా చేసుకుంటున్నారు. వీటిని నియంత్రించేందుకు లేద పరిశోధన చేసేందుకు ప్రత్యేకమైన వ్యవస్థలు ఏమిలేవు. ఆయా రాష్ట్రాల్లో పోలీస్ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం, అక్కడి పోలీసులకు సాంకేతికమైన పరిజ్ఞానం పెరగకపోవడంతో సైబర్ నేరస్థులు ఈ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. కొంత కాలం క్రితం పెద్దపల్లి రిజిస్ట్రేషన్ ఆఫీస్ డాటా హ్యాక్ అయినట్టు ప్రచారం జరిగింది. ఎందుకంటే రిజిస్ట్రేషన్ల సందర్భంగా వేలి ముద్రలు వేసిన అనేక మంది ఖాతాదారుల బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరస్తులు డబ్బులు కొట్టేశారు. వేలిముద్రలు స్కాన్ చేసుకోవడం ద్వారా ఆధార్‌కార్డుల స్మార్ట్ వర్క్ ద్వారా సైబర్‌క్రైమ్‌కు పాల్పడే వారు చాలామంది డబ్బులు కొట్టేశారు. సింగరేణి కార్మికుల వేతనాలు బ్యాంకు ఖాతాలోనే జమ కావడం వల్ల సింగరేణి కార్మికులను టార్గెట్ చేసిన సైబర్ నేరస్థులు తక్కువ మొత్తంలో కార్మికుల ఖాతాల నుంచి కాజేస్తున్నారు. తక్కువ మొత్తంలో కేసులపై పోలీసుల త్రీవత ఉండదని ఎత్తుడగా వ్యవహరించి ఎక్కువసార్లు కాజేస్తున్నారు. ఎక్కువ మంది కార్మికులు విద్యావంతులుగా లేకపోవడం, యాప్‌ల పేర, లోన్‌ల పేర మభ్యపెట్టి ఈ నేరాలకు పాల్పడుతున్నారు. ఒక్కొక్క బాధితుడి చిన్న మొత్తాలే అయినా వందలాది మంది బాధితుల నుంచి లక్షలాది రూపాయలను సైబర్ నేరస్థులు కొట్టేస్తున్నారు. బ్యాంకులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించినా సాంకేతికతను, ఖాతాదారుల బలహీనతలను వాడుకుంటూ సైబర్ నేరస్థులు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది.

ఘనంగా సీతారాముల కల్యాణం

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 17 : శ్రీరామ నవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో, హనుమాన్ ఆలయాల్లో శ్రీరామనగర్‌లోని శ్రీ రామాలయంలోనూ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ప్రక్రియతో పాటు మజ్జిగను అందించారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానఅర్చకులు మధుసూదనాచార్యులు, అర్చకులు అత్తైణచంద్రశేఖర శర్మ, గిరిధరాచార్యులు, శశిధరాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించగా, వేలాది మంది భక్తజనం వీక్షించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్-మనాలీ ఠాకూర్ దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి పూజలు చేశారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సీతారాములను దర్శించుకున్నారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులను భక్తులు దర్శనం చేసుకున్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతలరాజేష్, ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పెదెల్లి ప్రకాష్, గట్ల రమేష్, ఉల్లంగుల రమేష్, ఆలయ ఈవో పాల్గొన్నారు. కాకతీయనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో, చంద్రశేఖరనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో, జీఎంకాలనీలోని సంజీవాంజనేయస్వామి ఆలయంలో, మార్కండేయకాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద, 48వ డివిజన్ భక్తాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

జ్యోతినగర్ : శ్రీరామ నవమిని బుధవారం ఎన్టీపీసీ ఏరియాలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లోని హనుమాన్ ఆలయ ఆవరణలో జానకిరాముల వివాహ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎన్టీపీసీ జీఎం త్రిపాఠి, గుర్తింపు సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు. మల్కాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నాయకుడు రహీం, గ్రామస్తులు పాల్గొన్నారు. టీటీఎస్ హనుమాన్ ఆలయంలో, చిలుకలయ్య గుడి ప్రాంగణంలో జానకిరాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగా, రామగుండం నియోజకవర్గ ప్రజలపై సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరుకున్నారు. బుధవారం కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్-మనాలీఠాకూర్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణోత్సవంలో పాల్గొని అనంతరం ఆయన మాట్లాడారు.

పాలకుర్తి : మండలంలోని అన్ని గ్రామాలు బుధవారం వాడవాడలు, దేవాలయాలు రామనామ స్మరణతో మారుమోగాయి. ఉదయం పాలపొరుక ఘట్టంతో ప్రారంభమై కళ్యాణ ఘట్టంతో ముగిసింది.భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణ ఘట్టాన్ని తిలకించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో శ్రీరామ నవమిని పురస్కరించుకోని సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. మండలంలోని అప్పన్నపేట రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయరమణరావు హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. వెంట మాజీ ఎంపీపీ సందనవేన సునిత-రాజేందర్, మందల సత్యనారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌లు మాదిరెడ్డి నరసింహరెడ్డి, చింతపండు సంపత్, మందల రాజిరెడ్డి, భాస్కర్‌రెడ్డిలతో పాటు పలువురు ఉన్నారు. అలాగే అందుగులపల్లి, రాఘవపూర్, కనగర్తి, పెద్దకల్వల, కొత్తపల్లి, రంగాపూర్, బొంపల్లి, దేవునిపల్లి, పెద్దబొంకూర్, నిట్టూరు, తుర్కలమద్దికుంట, హన్మంతునిపేట, భోజన్నపేట, మూలసాలతోపాటు పలు గ్రామాల్లో కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు.

సుల్తానాబాద్ : మండలంలోని పలు ఆలయాల్లో గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్దె ఆంజనేయ స్వామి వరి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈసారి ఘనంగా కల్యాణం నిర్వహించారు. భక్తులకు తాగునీరు, మజ్జిక పాకెట్లు, అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల రామేశ్వర్‌రెడ్డి, పుష్పలత అన్నయ్య, సదాలక్ష్మి మురళి దంపతులు, కౌన్సిలర్ గొట్టం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు సుల్తానాబాద్, ఐతరాజుపల్లి, బొంతకుంటపల్లి గ్రామాల్లో జరిగిన కల్యాణోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.

రామగిరి : మండలంలోని సెంటినరీకాలనీ, కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధి మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవిమి వేడుకలు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ వనం రాంచందర్‌రావు, గంట వెంకటర మణరెడ్డి, నాయకులు తులసిరాంగౌడ్, కాటం సత్యం, బండారి సదానందం, మేకల మారుతీ తదితరులు పాల్గొన్నారు.

మంథని : పట్టణంలోని శ్రీలక్ష్మినారాయణస్వామి, శ్రీఅయ్యప్పస్వామి, గోదావరి తీరంలో ఉన్న శ్రీరామాలయంలో, ఎరుకలగూడెంలోని హనుమాన్ ఆలయంలో, శ్రీషిర్డిసాయిబాబా, పుట్టపర్తి సాయిబాబా ఆలయాల్లో, శ్రీరాంనగర్‌లోని శ్రీసీతారామాలయంలో గురువారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం సాగింది. శ్రీరాంనగర్‌లో శ్రీరామాలయంలో జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంథని రూరల్: మండలంలోని వెంకటాపూర్, ఆరెంద, ఎక్లాస్‌పూర్, ఖైదుపల్లి, గుంజపడుగు, నాగారం, దుబ్బపల్లి, ఉప్పట్ల, ఎక్లాస్‌పూర్, కాన్‌సాయిపేట, అడవిసోమన్‌పల్లి గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను గురువారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగపేట, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, కునారం, మొట్లపల్లి, మీర్జంపేట గ్రామాల్లో వేద పండితుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో శ్రీజగత్ మహామునీశ్వరస్వామి, రామాలయం, శివాలయంలో బుధవారం జరిగిన సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డితోపాటు గోపగోని సారయ్యగౌడ్, గాజనవేన సదయ్య, చదువు రామచంద్రారెడ్డి, పులి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి, సుల్తాన్‌పూర్, ముప్పిరితోట, నర్సాపూర్, ధూళికట్ట, లోకపేట, ఎలిగేడు, లాలపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. సుల్తాన్‌పూర్‌లో సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దుగ్యాల సంతోష్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, గొల్లె కావేరిభూమేష్, గోదల శ్రీనివాస్‌రెడ్డి, కొండ తిరుపతి, సంజీవరెడ్డి, పోట్యల రమేష్ పాల్గొన్నారు.

ధర్మారం : శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం మండలంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని రామాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమ్మరిఖాన్‌పేటలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఖిలావనపర్తి, బొట్లవనపర్తి, దొంగతుర్తి గ్రామాల్లో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం వైభవంగా జరిపారు.

జూలపల్లి : మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జూలపల్లి, కోనరావుపేట గ్రామాల్లో నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, విండో చైర్మన్‌లు కొంజర్ల వెంకటయ్య, పుల్లారి వేణుగోపాల్‌రావు, మినుపాల ప్రకాశరావు, దండె వెంకటేశం, దారబోయిన నర్సింహయాదవ్ తితరులు పాల్గొన్నారు.

ముత్తారం : ముత్తారం మండలంలోని ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు, పారిపల్లి, కేశనపల్లి, లక్కారం, మచ్చపేట, ఖమ్మంపల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవోపేతంగా గ్రామస్తులు నిర్వహించారు. ప్రతి గ్రామంలో శ్రీరామనామస్మరణతో మారు మోగింది. సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం కాలనీ, పోతనకాలనీలోని దేవాలయాల్లో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అర్చకులు జగన్నాథాచార్యులు కల్యాణం జరిపించారు. ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. అభయాంజనేయ ఆలయంలో అర్చకులు సుమంత్‌చార్యులు వేడుకలను జరిపించారు. పోతనకాలనీ హనుమాన్ దేవాలయంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

ఓదెల : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ధర్మకర్తల మండలి, ఈవో ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం కల్యాణ తంతును అర్చకులు నిర్వహించారు. పొత్కపల్లి, కొలనూర్ వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు గుంపుల రామభద్రాలయం, మడక ఉమామహేశ్వర, కనపర్తి శివాలయం, ఓదెల సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. పొత్కపల్లిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం, ఈవో సదయ్య, ధర్మకర్తలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంతర్గాం : మండల పరిధిలోని ఆయా గ్రామాలతో పాటు రామగుండం పట్టణంలోని దేవాలయాల్లో బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.





గోదావరిఖని కోదండ రామాలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు, కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలో..



పెద్దపల్లిలో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణరావు



ధర్మారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకవస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు



ఓదెల ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



ఎన్టీపీసీ పీటీఎస్‌లో సీతారాముల కల్యాణోత్సవం